

# విరామ సమయం

## మిర్రర్

"విశ్వమూర్తిని కాంచన చెంపదెబ్బ కొట్టిందట. గొడవ జరుగుతూంది" అని చెప్పాడు మెసెంజరు నా కేబిన్ లోకి వచ్చి.

అది లంచ్ టైము. ఆఫీసు సిబ్బంది అంతా క్యాంటీనుకు గానీ, దగ్గరలో వున్న హోటలుకు గానీ వెళ్ళి లంచ్ తీసుకుంటారు.

నాకు వయసు పైన బడింది. రిటైర్ మెంటు దగ్గరలో వుంది. ఆరోగ్యం మునుపటిలా వుండటం లేదు. అందు వల్ల చప్పిడి పదార్థాలు ఇంటినుంచి తెప్పించుకుని, ఆ కాస్తా నా కేబిన్‌లోనే కూర్చుని తినటం నాకు అలవాటు.

విశ్వమూర్తి, కాంచనతో పాటు ఇంకా కొంతమంది ఉద్యోగులు నాకిందే పనిచేస్తున్నారు. సెక్షను ఆఫీసరుగా జరిగిందేమిటో తెలుసుకోవలసిన బాధ్యత నా మీద ఉంది.

అందువల్ల త్వరగా లంచ్ ముగించి, కేబిన్ లోంచి బయట హాలులోకి వచ్చాను. మామూలుగా అయితే అప్పటికి అందరూ లంచ్ ముగించి తిరిగి తమ సీటుకి వచ్చివుంటారు. కానీ ఇప్పుడు ఒక్కరూ లేరు.

బాల్కనీలో నిలబడి కిందికి చూస్తుంటే, ఆఫీసు ఆవరణలో వున్న క్యాంటీను కనబడుతూంది. దాని ముందు ఆఫీసు ఉద్యోగులు, ఉద్యోగినులు గుంపులు గుంపులుగా నిలబడి హెచ్చు స్వరంలో మాట్లాడుకుంటున్నారు. కానీ నాకు ఏదీ స్పష్టంగా వినపడటం లేదు. పరిస్థితి ఉద్రిక్తంగా వుంది.

అలాంటి సమయంలో నేను అక్కడికి వెళ్ళటం ఎడ్మినిస్ట్రేటివ్ టాక్టిక్స్‌కి వ్యతిరేకం. అలా అక్కడికి వెళ్తే నేమ ఇరుకున పడటం జరుగుతుందని నా సుదీర్ఘమైన అనుభవంలో తెలుసుకున్నాను.

అయితే, జరిగిందేమిటో తెలుసుకోవాలన్న ఆతృతగా వున్నప్పటికి,

తిరిగి కేబిన్‌లోకి వచ్చి సీటులో సర్దుకున్నాను.

మరి కొద్దిసేపటిలో నా అసిస్టెంట్ మాధవరావు లోపలికి వచ్చాడు.

"ఏమిటి విషయం" అన్నాను నేను యధాలాపంగా.

"కాంచన విశ్వమూర్తిని చెంపదెబ్బ కొట్టిందట. అదికూడా అందరూ చూస్తుండగానే. దానిపై గలాభా జరుగుతూంది."

"ఆ అమ్మాయి అలా ఎందుకు కొట్టింది."

"అదే ఎవరికీ సరిగా తెలియదు. తలా ఒక రకంగా అనుకుంటున్నారు."

"ఏమనుకుంటున్నారు?"

"విశ్వమూర్తి ఆ అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించి వుంటాడు. అందుకు ఆమె తగిన బుద్ధి చెప్పి వుంటుంది, అని అమ్మాయిని వెనకేసుకొస్తున్న ఉద్యోగినులు అంటున్నారు."

"............"

"కానీ విశ్వమూర్తిని సమర్థించే మగవాళ్ళు, అంటే ఉద్యోగులు మాత్రం మరో విధంగా అంటున్నారు."

"ఏమని?"

"విశ్వమూర్తి అసభ్యంగా ప్రవర్తించివుంటే తగు చర్య తీసుకోవలసిందిగా పై అధికారులకి ఫిర్యాదు చేయాలి. అంతేకాని తనకు తాను సాటి ఉద్యోగిపై చెయ్యి చేసుకోవటం తప్పు. అసలు ఒక ఆడది మరో మగాడిపై చెయ్యి చేసుకోవటం మగజాతికే అవమానం. కాబట్టి ఇందుకు కాంచనపై 'క్రమశిక్షణ చర్య' తీసుకోవలసిందిగా కోరుతూ ఉద్యోగులు అంతా పట్టుదలగా వున్నారు."

"చాలా గొడవ జరిగిందన్నమాట."


"ఇంకావుంది. అసలు ఆడవాళ్ళకి ఈ సమాజంలో తగు రక్షణ లేకుండా పోతూందని, ఇది పదిమంది పనిచేసే ఆఫీసు కాబట్టి ఆడవాళ్ళకి తగు రక్షణ కల్పించటం అధికారుల బాధ్యత అని. జరిగినదానికి నిరసనగా విశ్వమూర్తిని శిక్షించాలని ఉద్యోగినులు కూడా పట్టు బడుతున్నారు" అన్నాడు అతను.

నేను ఆలోచించసాగాను.

విశ్వమూర్తి మంచి ఆదర్శభావాలు కల యువకుడు. అతని ప్రవర్తన గురించి నాకు తెలుసు అతను సాటి ఉద్యోగిని పట్ల అసభ్యంగా ప్రవర్తించేంత మానసిక బలహీనుడు కాదు.

ఇకపోతే కాంచన.

కాంచన ఈ ఆఫీసులో చేరి ఏడాది అయింది. డిగ్రీ పూర్తి చేసినతర్వాత ఈ ఉద్యోగంలో ప్రవేశించింది. ఇంకా పెళ్ళి కాలేదు. వయసు ఇరవై రెండేళ్ళుంటాయి. ఎవరితోనూ మాట్లాడదు. ఎవరినీ పలకరించదు. తన సీటులో కూర్చుని దీక్షగా పని చేసుకుపోవటం ఆమె అలవాటు.




మరి ఇలాంటి ఇద్దరి మధ్య ఈ సంఘటనకి దారితీసిన పరిస్థితులు ఏము న్నాయో అర్ధంకాలేదు.

ఏది ఏమైనా ఇద్దరూ నాకింద పని చేస్తున్నారు. జరిగిన సంఘటనకి తప్పు ఎవరిదైనా, గొడవ మరింత పెద్దది కాకుండా ప్రారంభంలోనే చల్లార్చటం మంచిది.

లేదంటే, రిటైరు కాబోతున్న ఈ చివరిభాగంలో డిసిప్లినరీ కేసులు, ప్రొసీడింగులు అంటూ బాధపడవలసి రావటమే కాక ఫలానా సెక్షనులో జరిగిన సంఘటన ఇది అని అంటే పై స్థాయిలో నా ప్రతిష్ఠకి భంగం కలగ వచ్చు.

అందువల్ల—

"అసలు విషయం ఏమిటో వారి నుంచే తెలుసుకుందాం. ముందు విశ్వ మూర్తిని, కాంచనని నా కేబిన్‌లో ప్రవేశపెట్టు" అన్నాను మాధవరావుతో.

అతను చిన్నగా నవ్వి—

"వాళ్ళిద్దరూ ఎప్పుడో ఇంటికి వెళ్ళి పోయారు"

"ఎందుకు?"

"జరిగిందానికి ఇద్దరినీ మందలించి కేసు సర్దుబాటు చేస్తారని, అలాంటిది జరగకుండా తప్పు చేసినవారు శిక్షింప బడాలంటే అసలు వ్యక్తులు ఇద్దరూ పై అధికారులకి అందుబాటులో వుండకూడ దట అందుచేత, ఉద్యోగులు విశ్వ మూర్తిని, వెంటనే ఆటో ఎక్కించి ఒకరు తోడుగా వుండి. ఇంటికి పంపించి వేసారు. అలాగే ఉద్యోగినులు కూడా ఒక తోడు ఇచ్చి కాంచనని ఇంటికి పంపించివేసారు."

గొప్ప చిక్కువచ్చి పడినట్లయింది.

అసలు వ్యక్తులు లేకుండా విషయం తెలుసుకోవటం ఎలా? సమస్య పరిష్క-

రించటం ఎలా? ఇలాంటి పరిస్థితి నా సర్వీసులో ఇంతకుముందు చూడలేదు.

ఇంతలో కిందనుంచి పెద్దగా నినాదాలు, అరుపులు వినిపించసాగాయి.

విరామ సమయం దాటిపోయినా ఎవరూ ఇంకా సీటులోకి రాలేదు. పరిస్థితి చెయ్యిదాటిపోయేలా వుందని పిస్తూంది.

కేబిన్ నుంచి బయటకు వచ్చి, హాలు దాటుకుంటూ బాల్కనీలో నిలబడి కిందికి చూసాను.

మగవాళ్ళంతా ఒక ప్రక్కగా నిలబడి వున్నారు.

మరోప్రక్కగా ఆడవాళ్ళు నిలబడి వున్నారు.

వాళ్ళ చేతుల్లో అప్పటికప్పుడు తయారుచేసిన బ్యానర్లు కొన్ని వున్నాయి.

"ఆడవాళ్ళ అహంకారం నశించాలి."

"మగవాడిపై చెయ్యి చేసుకోవటం స్త్రీజాతికే అవమానం."

"పురుషాధిక్యత నశించాలి!"

"పరస్త్రీని గౌరవించటం పురుషులు నేర్చుకోవాలి!"

"ఆడవాళ్ళకు ఆఫీసులో రక్షణ కల్పించాలి!"

"మగవాళ్ళకు ఆఫీసులో రక్షణ కల్పించాలి!"

—మొదలయిన నినాదాలు అట్టల మీద వ్రాసి పట్టుకుని, పెద్దగా అరుస్తూ రెచ్చిపోతున్నారు.

గొడవ నా పరిధి దాటిపోయిందని స్పష్టంగా తెలుస్తూంది.

ఇంతలో డైరెక్టరుగారి నుంచి నాకు పిలుపు వచ్చింది.

లిఫ్టులో పై అంతస్తు చేరుకుని ఆయన కేబిన్‌లో ప్రవేశించాను.

అప్పటికే ఆడవాళ్ళ తరఫున ఒకరు, మగవాళ్ళ తరఫున ఒకరు నినాదాలుగల అట్టలు పట్టుకుని డైరెక్టరుగారి ముందు కూర్చుని వున్నారు.

జరిగిన సంఘటన గురించి తన మాటలలో క్లుప్తంగా చెప్పి, ఇద్దరూ నాకిందే పనిచేస్తున్నారు కాబట్టి, మీకు తోచిన విధంగా సమస్య పరిష్కరించండి—అంటూ ఆయన ఆజ్ఞాపించారు.

ఆయన ఎప్పుడూ ఇంతే. ఇలా చెయ్యి అని చెప్తారు. ఎలా చెయ్యాలో, ఏం చెయ్యాలో మళ్ళీ మేమే ఆలోచించుకోవాలి. ఫలితం ఆయన ఊహించినట్టుగా ఉంటే "వెరీ గుడ్" అనటం, లేకపోతే "వెరీ బేడ్" అనటం అన్నీ ఆయనకే చెల్లు.

"ఓకే సార్!" అంటూ బయటకు వచ్చి నా కేబిన్ చేరుకున్నాను.

విషయం డైరెక్టరు లెవెల్‌కి వెళ్ళిపోయింది. బయట ఉద్యోగులు ఇంకా గొడవ చేస్తూనే వున్నారు. ఇక ఈ పూటకి వాళ్ళెవరూ సీటుకి వచ్చి పని చేయరు.




ఈ స్థితిలో నాకు రెండు మార్గాలున్నాయి.

ఒకటి—

జరిగిన దానికి నివేదిక తయారుచేసి దోషులను శిక్షించవలసిందిగా డైరెక్టరు గారికి రికమెండ్ చేయటం.

రెండు—

ఉద్యోగులను ఆందోళన విరమించుకుని పనిలోకి వచ్చేలా చేయటం.

నా కింద పనిచేస్తున్న ఆ ఇద్దరిపట్ల వ్యక్తిగతంగా నాకు గల అభిమానం రీత్యా వాళ్ళని సస్పెండ్ చేయించలేను.

రెండవ పద్ధతిలో సమస్య పరిష్కరించటం నా శక్తికి మించిన పని అయిపోయింది.

ఆలోచించగా ఒకసారి విశ్వమూర్తిని, కాంచనని చూసి సంఘటనకి కారణమైన పరిస్థితి తెలుసుకోవాలనిపించింది.

ఆఫీసు రికార్డులోంచి అడ్రసులు తీసుకుని మాధవరావు తోడురాగా ముందుగా కాంచన ఇంటికి బయలుదేరాను.

ఆమె మలక్‌పేట టి. వి. టవర్ ఎదురుగా వున్న సందులో ఓ ఇంటిలో వుంటోంది.

ఆఫీసు జీపు ఆ ఇంటి ముందు ఆగింది. నేను జీపు దిగి రెండు అడుగులువేసి, అక్కడి దృశ్యం చూసి ఆశ్చర్య పోయాను.

కాంచన, విశ్వమూర్తి ఇద్దరూ ముందు వరండాలో కూర్చుని నవ్వుకుంటూ టీ తాగుతున్నారు. ఒక వృద్ధ వితంతువు అంతదూరంలో గుమ్మంలో నేలమీద కూర్చుని వుంది.

నన్ను చూసి ఇద్దరూ లేచి నమస్కరించారు.

విశ్వమూర్తి సిగ్గుతో తల అటు తిప్పుకున్నాడు.

కాంచనకి ఉద్వేగంతో కన్నీళ్ళు పెల్లుబికి పైటచెంగుతో తుడుచుకుంది.

"ఏమిటమ్మా ఇదంతా!" అన్నాను నేను చెయిర్‌లో కూర్చుంటూ.

"అసలు తప్పు అంతా నాదేనండి!" అన్నాడు విశ్వమూర్తి బాధపడుతూ.

"అతనిది ఏమీ తప్పులేదండి అంతా నా తప్పే" అంది కాంచన.

"అసలు జరిగిందేమిటో చెప్పండి!" అన్నాను.

ముందుగా విశ్వమూర్తి మొదలు పెట్టాడు.

"హెడ్డాఫీసుకు వెళ్ళవలసిన రిపోర్టు గత రెండు రోజులుగా మేము ఇద్దరం కలిసి తయారు చేస్తున్నాము. ఈ రోజు లంచ్ టైము అవగానే, నేను సాధారణంగా నా తోటివారితో అన్నట్టుగానే, కాంచనని—రండి! హోటలుకి వెళ్ళి భోజనం చేద్దాం అన్నాను. అందుకు ఆమె వెంటనే నా చెంపమీద కొట్టింది. నేను ఆలోచించసాగాను." అన్నాడు అతను.

"విశ్వమూర్తిగారు చెప్పింది నిజం. అంతకు మించి వారు ఒక్క ముక్క ఎక్కువ అనలేదు. నేనే తొందరపడి అతన్ని చెంపదెబ్బ కొట్టాను. ఆ తరువాత చాలా బాధపడ్డాను."

"అతను అన్నదాంట్లో తప్పు ఏముందమ్మా. నువ్వు అలా ఎందుకు ఆవేశపడ్డావు."

"అందుకు కారణం మా నాయనమ్మే నండి" అంది కాంచన నవ్వుతూ.

"ఎలా?"

"నాకు తల్లి తండ్రి చిన్నప్పుడే పోయారు. మా నాయనమ్మ నన్ను కష్టపడి పెంచి చదివించింది. అయితే నాకు పదహారేళ్ళు వచ్చేసరికి నాకు మగవాళ్ళ పట్ల ఏహ్యభావం కలిగేలా నూరిపోసింది. ఈ సమాజంలో మగవాళ్ళంతా కపటబుద్ధి కలవారని, మగవాడు స్త్రీని వంచించటంకోసం అనేక రకాలుగా ప్రయత్నిస్తుంటారని అందులోభాగంగా అనేక పద్ధతులు ఉపయోగిస్తాడని చెప్పింది. అసలు మగవాడిని మొదటి నుంచి దూరంగా వుంచితే ఆడదానికి ఎలాంటి ప్రమాదం రాదని కూడా

చెప్పింది. ఇదంతా నమ్మి నేను ఇంత కాలం అమలుచేస్తూ వచ్చాను.

"అందువల్ల విశ్వమూర్తిగారు హోటలుకి రమ్మనగానే, ఆయన నన్ను వంచించటానికి ప్రయత్నిస్తున్నట్టుగా భావించి, మా నాయనమ్మగారి బోధన ప్రకారం ఆయన్ని చెంపదెబ్బకొట్టాను.

"తరువాత అది ఎలాంటి పరిస్థితికి దారి తీసిందీ, నేనెంత తప్పు చేసిందీ, ఆత్మ విమర్శ చేసుకుని పశ్చాత్తాపపడ్డాను.

"విశ్వమూర్తి మంచివారు. కాబట్టి నన్ను క్షమించి, మా ఇంటికి వచ్చి, ఇప్పటివరకూ సోదరభావంతో నా దృక్పథంలో గల లోపాలను నాకు తెలిసేలా చెప్పారు" అంది ఆమె.

ఒక కాంచన విషయంలోనే కాదు.

ఇంకా అనేకమంది ఆడపిల్లలకి వాళ్ళ పెద్దవాళ్లు మగవారిపట్ల చెడ్డ అభిప్రాయం కలిగేలా నూరిపోస్తున్నారు.

తమ పిల్లలకు జాగ్రత్తలు చెబుతున్నట్టుగా వారు భావిస్తూ వుండవచ్చు. కానీ చివరికి సమాజంలో మగవాడిపట్ల ఆ ఆడపిల్ల ఎంత అర్థరహితమైన అవగాహన ఏర్పరచుకుంటూందో వారు గ్రహించలేకపోతున్నారు.

మగవారిలో స్వార్థపరులు, వంచకులు ఉండవచ్చేమోకానీ, మగవాళ్ళంతా అలాంటివారే అనే అర్థం వచ్చేలా పిల్లలకు బోధించటం పెద్దవాళ్ళకు తగదు.

కాలం మారింది.

సామాజిక పరిస్థితులు మారాయి.

మారిన వ్యవస్థలో, ఈనాడు స్త్రీకి మగవారి మధ్య ఎక్కువ కాలం గడపవలసి వస్తూంది.

అందువల్ల వారు మగవారిపట్ల సద్భావం పెంచుకోవటం అందరికీ శ్రేయస్కరం.

అయితే ఈ విషయం పెద్దలు గ్రహించేలా చేయటం ఎలా అని ఆలోచిస్తూ తిరిగి బయలుదేరాను.

